క్లుప్తంగా

నిబద్ధతతోనే గుర్తింపు



పదోన్నతి పొందిన అధికారులతో అనురాధ

సిద్దిపేటకమాన్: పదోన్నతులు మరింత బాధ్యతను పెంచుతాయని, నిబద్ధతతో విధులు నిర్వహిస్తే గుర్తింపు వస్తుందని సీపీ అనురాధ అన్నారు. ఏఎస్‌ఐ నుంచి ఎస్‌ఐలుగా పదోన్నతి పొందిన చిన్నకోడూరు, గజ్వేల్, దౌల్తాబాద్ స్టేషన్‌లకు చెందిన మురళీధర్‌గౌడ్, మహమ్మద్ మంజూరు హుస్సేన్, బిఖ్యానాయక్‌లను తన కార్యాలయంలో సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిజాయితీగా ప్రజలకు సేవలందించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పోలీసు సంఘం ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

అపార్ కార్డు తప్పని సరి



మాట్లాడుతున్న ఎంఈఓ కనకరాజు

దౌల్తాబాద్(దుబ్బాక): ప్రతి ఒక విద్యార్థికి అపార్ కార్డు తప్పనిసరిగా ఉండాలని మండల విద్యాధికారి గజ్జెల కనకరాజు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఆన్‌లైన్‌లో అపార్ కార్డు జనరేట్ చేసేటప్పుడు ఎలాంటి తప్పులు దొర్లకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ప్రైవేట్, కాంప్లెక్స్ పాఠశాలల హెచ్‌ఎంలు అఫ్జల్ హుస్సేన్, గోపాల్ రెడ్డి, మండల వనరుల సిబ్బంది, సీఆర్పీలు పాల్గొన్నారు.

ఎన్నవెళ్లికి ఘన సన్మానం



రాజమౌళిని సన్మానిస్తున్న సభ్యులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కథల తాతయ్య, ప్రముఖ బాలసాహితీవేత్త ఎన్నవెళ్లి రాజమౌళిని ఘనంగా సన్మానించారు. శరభేశ్వర ఆలయంలో జిల్లా జంగమ సమాజం 13వ వార్షికోత్సం సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుంచి బాలసాహితీ పురస్కారం అందుకున్న రాజమౌళిని జంగమ సమాజ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నగేశ్, ఆనందయ్య, శశిధర్, ఉమాపతి, విధుమౌళి, నాగరాజు పాల్గొన్నారు.

పథకాల కోసం వినతి



వినతి పత్రం అందజేస్తున్న సంఘ నాయకులు

హుస్నాబాద్: ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులకు వర్తింపజేయాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునకు సోమవారం ఆ ఉద్యోగ సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. రిటైర్డ్ అయిన తర్వాత ఫించన్ లేక నానా ఇబ్బందులకు గురవుతున్నామని, ప్రభుత్వ పథకాలైనా ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం నాయకులు రాజిరెడ్డి, సాయిలు, అఫ్జల్, శంకర్ తదితరులు ఉన్నారు.

స్పృహతప్పిన మహిళ



మహిళను తీసుకువెళ్తున్న కానిస్టేబుల్ రజనీకాంత్

కొమురవెల్లి(సిద్దిపేట): స్పృహతప్పిపోయిన మహిళను పోలీసులు కాపాడిన ఘటన కొమురవెల్లిలో చోటు చేసుకుంది. సోమవారం మల్లికార్జునస్వామి పట్నం వారం సందర్భంగా నిర్వహించిన పెద్దపట్నం అగ్నిగుండాలకు హాజరైన మహిళ స్పృహతప్పి కిందపడిపోగా అక్కడ విధులు నిర్వహిస్తున్న ఏఆర్ కానిస్టేబుల్ రాజనీకాంత్ ఆమెను తీసుకువెళ్లి మెడికల్ సిబ్బందితో వైద్యం చేయించి సాయంచేశారు. ఉన్నతాధికారులు అతడిని అభినందించారు

విద్యా దానం గొప్పది

కొండపాక(గజ్వేల్): అన్ని దానాల కంటే విద్యా దానం గొప్పదని ఎంఈఓలు బచ్చలి సత్తయ్య, శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కుకునూరుపల్లి మండలంలోని మేదినీపూర్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు వెంకటరమణ సహకారంతో 50 మంది విద్యార్థులకు క్రీడా దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం దాతలు ముందుకు రావడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటేశం, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నిద్రావస్థలో నిఘా నేత్రాలు

పనిచేయని సీసీ కెమెరాలు

- కొరవడుతున్న పోలీసుల పర్యవేక్షణ
- రోజురోజుకూ పెరుగుతున్న చోరీలు
- పట్టించుకోని అధికారులు

ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానం అంటూ పోలీస్ అధికారులు చెబుతుంటారు. ప్రచారంలో భాగంగా చాల చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. వాటి సాయంతో నేరస్తులను పట్టుకోవడం సులభంగా ఉంటోంది. అయితే చాలా చోట్ల వాటి నిర్వహణ బాధ్యతను గాలికొదిలేస్తున్నారు. దీంతో నేరాలు జరిగినా న్యాయం జరగని పరిస్థితి నెలకొంది.



గుబ్బడి గ్రామంలో పనిచేయని సీసీ కెమెరా

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలో 37 గ్రామాలు ఉండగా సుమారు 163కి పైగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఒక్కొక్క గ్రామాల్లో 5 నుంచి 8 సీసీ కెమెరాలున్నాయి. ఎంతో ఆర్భాటంగా ప్రారంభించినా ఆ స్థాయిలో నిర్వహణ లేకపోవడంతో ఇప్పుడు పోలీసులకు ఇబ్బందికరంగా మారింది.

మరమ్మతులు లేవు

నేరాల అదుపుచేయడంలో కీలకంగా మారిన సీసీ కెమెరాల ఏర్పాటుకు పోలీసుల ప్రత్యేక చొరవ తీసుకొన్నారు. ప్రజాప్రతినిధుల, దాతలు, వ్యాపారులు ఇతర సంస్థల సహకారంతో గ్రామాల్లో ఏర్పాటు చేయించారు. ప్రతి గ్రామంలోను పంచాయతీ కార్యాలయంలో అనుసంధానం చేసి నిరంతరం వీక్షించేలా చర్యలు తీసుకొన్నారు. మొదట్లో బాగానే పనిచేసినా మరమ్మతుల నిర్వహణ సమస్యగా మారింది. అందుకోసం ప్రత్యేక సిబ్బందిగాని, నిధులుకాని కేటాయించలేదు. దీంతో నిర్వహణ కరువైంది.

దొంగల భయం పెరిగింది



మా గ్రామంలో ఇటీవల ఓ ట్రాక్టర్ డబ్బా, పాఠశాలలో పలు సీసీ కెమెరాలు, బావి మోటర్ చోరీకి గురైంది. 2019లో దివంగత ఎస్‌ఐ పాపయ్యనాయక్ చొరవతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. కొంతకాలం బాగానే పనిచేసినా ప్రస్తుతం పనిచేయడం లేదు. దీంతో దొంగలు మరింత రెచ్చిపోతున్నారు. గ్రామాల్లో పోలీసులు గస్తీ నిర్వహిస్తే బాగుంటుంది.
- వీరాచారి, గౌరవెల్లి

పెరుగుతున్న చోరీలు

మండలంలోని పలు గ్రామాల్లో రోజురోజుకూ దొంగతనాలు పెరిగిపోతున్నాయి. రాత్రి, పగలు అనే తేడా లేకుండా చోరీలకు పాల్పడుతున్నారు. ఇటీవల గౌరవెల్లిలోని ట్రాక్టర్ డబ్బాను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. అలాగే పాఠశాలలో దాదాపు ఆరు సీసీ కెమెరాలు, పక్కనే ఉన్న బావి మోటర్‌ను దొంగలించారు. అదేవిధంగా చౌడుతండాలో ఓ ఇంట్లో విలువైన వస్తువులను దొంగలు ఎత్తుకెళ్లినట్లు తండావాసులు చెబుతున్నారు. అలాగే వంకాయతండాలో ఓ ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలోని రూ.15వేల నగదు అపహరించారు. దీంతో గ్రామాల్లో దొంగల భయంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా గ్రామాల్లో గస్తీ నిర్వహించవలసినప పోలీసులు కన్నెత్తి చూడడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇకనైనా రాత్రి సమయాల్లో పోలీసులు గస్తీ నిర్వహించేలా పోలీసులు ఉన్నతాధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రామసభలు సజావుగా నిర్వహించాలి

డీపీఓ దేవకీ దేవి

మద్దూరు(హుస్నాబాద్): రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు కోసం గ్రామాల్లో నిర్వహించే గ్రామసభలు సజావుగా జరిగేందుకు ప్రతి ఒక్కరు సహకారించాలని జిల్లా పంచాయతీ అధికారి దేవకీ దేవి పిలుపునిచ్చారు. మద్దూరు, ధర్మారం పంచాయతీ కార్యాలయాలను సోమవారం ఆమె సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల కోసం అర్హులను ఎంపికను అధికారులు పారదర్శకంగా జరిపేందుకు కృషి చేయాలన్నారు. పంచాయతీ రికార్డుల నిర్వహణపై కార్యదర్శులు శ్రద్ధ వహించాలని, గ్రామసభలను విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామ్మోహన్, ఎంపీఓ వీరరాజు, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామ, వార్డు సభలు

హుస్నాబాద్/వర్గల్(గజ్వేల్)/మిరుదొడ్డి(దుబ్బాక)/గజ్వేల్‌రూరల్/సిద్దిపేటజోన్: ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల కోసం నిర్వహించే వార్డు, గ్రామసభలను ప్రజలు వినియోగించుకోవాలని అధికారులు కోరారు. 21 నుంచి 24వ తేదీ వరకు సభలు నిర్వహిస్తారని చెప్పారు. హుస్నాబాద్ మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ సోమవారం మాట్లాడుతూ పట్టణంలో 1వ నుంచి 5వ వార్డు వరకు మంగళవారం వార్డు సభలు ఉంటాయన్నారు. కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా అర్హుల జాబితా కోసం ఈ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఇంటింటా సర్వే నిర్వహించామని, ఎవరైనా దరఖాస్తులు చేసుకోని వారుంటే చేసుకోవాలని సూచించారు. అలాగే వర్గల్ ఎంపీడీఓ విజయలక్ష్మి మాట్లాడుతూ మంగళవారం మీనాజీపేట, తున్కిఖాల్సా, నెంటూరు, జబ్బాపూర్, నాచారం, అనంతగిరిపల్లి, గోవిందాపూర్, సింగాయపల్లిలో గ్రామసభలు జరుగుతాయన్నారు. మిరుదొడ్డి మండల పరిధిలో 21న భూంపల్లి, చౌదర్‌పల్లి, మోతె, రామేశ్వరం పల్లి, 22న అక్బర్‌పేట, బేగంపేట, చిట్టాపూర్, ఎనగుర్తి, నగరం, రుద్రారం, 23న చిన్న నిజాంపేట, ఖాజీ పూర్, తాళ్లపల్లి, బొప్పాపూర్, వీరారెడ్డిపల్లి, జంగపల్లి, 24న అల్మాజీపూర్, కూడవెల్లి, పోతారెడ్డి పేట గ్రామాల్లో గ్రామసభలను నిర్వహిస్తామని తహసీల్దార్ చంద్రశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య, గజ్వేల్ ఎంపీడీఓ ప్రవీణ్‌లు వేర్వేరుగా ప్రకటనలను విడుదల చేశారు. మొదటి రోజు గజ్వేల్ 5 వార్డులలో సభలు ఉంటాయని, మండల పరిధిలోని ఆరెపల్లి(ఎస్‌బీ), బూర్గుపల్లి, అహ్మదీపూర్, అక్కారం, ర్యాగట్లపల్లి, మక్తమాసన్‌పల్లి, జాలిగామ, శ్రీగిరిపల్లి గ్రామాల్లో సభలు నిర్వహిస్తారని తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు వార్డుసభలు జరుగుతాయని సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన వార్డు అధికారులు, నాయకులతో సమావేశం నిర్వహించారు.



మద్దూరు(హుస్నాబాద్): రికార్డులను పరిశీలిస్తున్న దేవకీదేవి

అభివృద్ధి చేయకపోతే రాజకీయ సన్యాసం

కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి

దుబ్బాకటౌన్: స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే దుబ్బాకను అభివృద్ధిచేసి చూపిస్తానని లేనిపక్షంలో రాజకీయ సన్యాసం తీసుకుంటానని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మల్లన్నసాగర్ కాలువ నీటిని మంత్రి కొండా సురేఖ విడుదల చేసినపుడు ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి వ్యాఖ్యలు సరికాదన్నారు. సాగర్ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతుల పక్షాన పోరాడి వారికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, ఇళ్లు ఇప్పించిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందన్నారు. ప్రాజెక్టుల పేరుతో అక్రమంగా సంపాదించిన డబ్బును ఓటర్లకు పంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన ప్రభాకర్‌రెడ్డి ప్రొటోకాల్ గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు అనంత శ్రీనివాస్, రవి, సాయి, వెంకట్‌గౌడ్, నరేశ్, శ్రీనివాస్ తదితరులున్నారు

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

మిరుదొడ్డి(దుబ్బాక): ఎవరెన్ని విమర్శలు చేసినా దుబ్బాక అభివృద్ధికే పాటు పడతానని చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో మండల పరిధిలోని మల్లుపల్లి, చెప్యాల, అల్వాలలో చేపట్టే సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణాల పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరు సహకరించి అభివృద్ధిలో పాలుపంచు కోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సాయి లు, రాజేశ్, ఎండీ హర్షద్, నవాజ్, కిష్టయ్య, భూపాల్ గౌడ్, భూపతి గౌడ్, జహంగీర్, మహేశ్, రాజు, మహేందర్, కన్నారెడ్డి, రత్నారెడ్డి, నాగరాజు, రాములు, కనకయ్య తదితరులు పాల్గొన్నారు



దుబ్బాకటౌన్: మాట్లాడుతున్న శ్రీనివాస్ రెడ్డి

సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో..

తొగుట(దుబ్బాక): సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. మండలంలోని చందాపూర్, పెద్దమాసాన్‌పల్లి, బండారుపల్లి, ఘనపురం గ్రామాల్లో అధికారులతో కలిసి సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. నియోజకవర్గానికి రూ.6కోట్లు మంజూరు చేయించామన్నారు. స్వామి, ప్రవీణ్, రాంరెడ్డి, కొండల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై దాడులు ఖండిస్తున్నాం

- పీఆర్‌టీయూ జిల్లా నేత శశిధర్‌శర్మ
- పలుచోట్ల నల్లబ్యాడ్జీలతో నిరసనలు

రంగారెడ్డిజిల్లా తుక్కుగూడ హెచ్‌ఎం రాములుపై జరిగిన దాడిని జిల్లాలోని పలుచోట్ల ఉపాధ్యాయులు ఖండించారు. ఉపాధ్యాయ సంఘాల పిలుపు మేరకు సోమవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసనలు తెలిపారు.

వర్గల్(గజ్వేల్)/ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)/జగదేవ్‌పూర్(గజ్వేల్)/అక్కన్నపేట(హుస్నాబాద్)/మద్దూరు(హుస్నాబాద్)/నంగునూరు(సిద్దిపేట): వర్గల్ మండలం చౌదరిపల్లి జెడ్పీ, ప్రైమరీ పాఠశాలల ఆవరణలో మధ్యాహ్న భోజన వేళ ఉపాధ్యాయులతో కలిసి నల్లబ్యాడ్జీలతో పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శశిధర్‌శర్మ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులపై జరుగుతున్న దాడులను ఖండిస్తున్నామన్నారు. మత మనోభావాలు దెబ్బతినే విధంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకోవాలే తప్ప భౌతికదాడులకు పాల్పడడం ఉపాధ్యాయ వ్యవస్థనే అవమానించనట్లన్నారు. హెచ్‌ఎంలు వెంకట్ రెడ్డి, జైపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు జె.శ్రీనివాస్, బుచ్చిరాములు, కృష్ణారెడ్డి, శైలజ, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు. టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ వలీ హమ్మద్, తప్పెట్ల యాదగిరి మాట్లాడారు. డిసెంబర్ 23న కొందరు వ్యక్తులు తుక్కుగూడ ఉన్నత పాఠశాలలోకి చొరబడి విచక్షణ రహితంగా ప్రధానోపాధ్యాయులు రాములుపై దాడి చేశారని వాపోయారు. బాధ్యులను గుర్తించి శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నేతలు కృష్ణ, రామచంద్రం తదితరులు పాల్గొన్నారు. అలాగే ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కోట ప్రభు మాట్లాడుతూ విద్యాబుద్ధులు నేర్పించే ఉపాధ్యాయులపై దాడి హేయమైన చర్య అన్నారు. ఉపాధ్యాయులు మల్లయ్య, శ్రీనివాస్‌గౌడ్, అశోక్‌రెడ్డి, వెంకటేశం, అంజిరెడ్డి, సుజాత, ఉదయశ్రీ, తదితరులు పాల్గొన్నారు. జగదేవ్‌పూర్ పరిధిలోని తిమ్మాపూర్ పాఠశాలలో జరిగిన నిరసన కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి రాంచంద్రం పాల్గొన్నారు. బోధన చేస్తున్న క్రమంలో అయ్యప్ప మాల వేసుకున్న విద్యార్థికి మోకాలు తగిలిందన్న కారణంలో 23న భక్తుల ముసుగులో అసాంఘిక శక్తులు హెచ్‌ఎం రాములుపై దాడి చేశారని, దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అక్కన్నపేట మండలం గౌరవెల్లి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. హెచ్‌ఎం అనంతుల జ్యోతి, ఉపాధ్యాయులు రామన్‌బాబు, శంకర్‌నాయక్, కృష్ణకుమారి, చంద్రారెడ్డి, చందా, మంజూ, రమణ తదితరులు పాల్గొన్నారు. మద్దూరు మండలం రేబర్తి గ్రామంలోని ఉన్నత పాఠశాలలో ఎంఈఓ వరదరాజు మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రభాను, పీఆర్‌టీయూ నేత శ్రీనివాస్‌రెడ్డి, టీపీటీఎఫ్ నేత మల్లేశం, ఉపాధ్యాయులు నర్సింహులు, రఫత్, సంపత్, శిరీష, రవి తదితరులు పాల్గొన్నారు. నంగునూరు పరిధిలోని గట్లమల్యాల, నర్మేట పాఠశాలల ఉపాధ్యాయులు మనీష్ కుమార్, రమేశ్, అశోక్, విజయ్‌కుమార్, దత్తాద్రి, రామస్వామి, కిషన్, లింగం, నరేశ్, రాజ్‌కుమారత్ తదితరులు నిరసన తెలిపారు.



చౌదరిపల్లి స్కూల్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న శశిధర్‌శర్మ, ఉపాధ్యాయులు

పేదలకే మొదట ఇందిరమ్మ ఇళ్లు

జిల్లా పశువైద్యాధికారి వెంకట్‌రెడ్డి

హుస్నాబాద్‌రూరల్: నిరుపేదలకే ఇందిరమ్మ ఇళ్లను మొదట అందజేస్తారని జిల్లా పశువైద్యాధికారి వెంకట్‌రెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణానికి సోమవారం భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ 21న బంజేరుపల్లి, మీర్జాపూర్, బంజేరుపల్లి, ఉమ్మాపూర్, గాంధీనగర్, 22న నాగారం, వంగ రామయ్యపల్లి, మాలపల్లి, తోటపల్లి, 23న కూచనపెల్లి, భల్లునాయక్‌తండా, పోతారం(ఎస్), మడద, రాములపల్లి, 24న పొట్లపల్లి, పందిల్ల, మహ్మదాపూర్, జిల్లెలగడ్డ గ్రామాల్లో సభలు జరుగుతాయన్నారు. హౌసింగ్ డీఈ శంకరయ్య, డీఎల్పీఓ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చందు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

రేషన్ కార్డులు, ఇళ్లు ఇవ్వకపోతే పోరాటమే..

గజ్వేల్: అర్హులందరికీ రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని, లేనిపక్షంలో ప్రజల పక్షాన పోరాడుతామని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్, బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం గజ్వేల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలపై మండిపడ్డారు. దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో 28న జరిగే గ్రామసభల్లో ప్రజల నుంచి నిరసన ఎదురు కాకతప్పదని, ఇచ్చిన హామీలను అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎక్కడికక్కడ నిలదీస్తామని హెచ్చరించారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ ఊడెం కృష్ణారెడ్డి, మర్కూక్ మాజీ ఎంపీపీ పాండు గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు ఉమర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రతాప్‌రెడ్డి

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని పలు ప్రాంతాల్లో తమ సిబ్బందితో కలిసి వారం రోజుల క్రితం నిర్వహించిన వాహన తనిఖీల్లో 11 మంది పట్టుబడ్డారు. వారిని సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా సోమవారం విచారణ జరిపిన న్యాయమూర్తి వారికి రూ.27వేల జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

రాంగ్ రూట్‌లో నడపొద్దు

సిద్దిపేటకమాన్: వాహనాలను రాంగ్ రూట్‌లో నడపొద్దని ట్రాఫిక్ ఏఎస్‌ఐ ఉమేశ్ సూచించారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా పాత బస్టాండ్ చౌరస్తాతో పాటు పలు ప్రాంతాల్లో ఏఎస్‌ఐ సదాశివరావు, సిబ్బందితో కలిసి ఆటో డ్రైవర్లు, వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై సోమవారం అవగహన కల్పించారు. మద్యం తాగి వాహనాలను నడిపినా, ట్రిపుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్ చేసే వారిపైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ సత్యం, శ్రీనివాస్‌రెడ్డి, కానిస్టేబుళ్లు మహేశ్, జగదీశ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

సీఐ మురళి

గజ్వేల్‌రూరల్: మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ట్రాఫిక్ సీఐ మురళి హెచ్చరించారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన చౌరస్తాల వద్ద ఇటీవల డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించగా 30 మంది వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారు. వారిని సోమవారం జడ్జి ప్రియాంక ఎదుట హాజరు పర్చగా విచారణ అనంతరం 30మందికి రూ.17వేల జరిమానా విధించినట్లు తెలిపారు.

మాటలు నమ్మి మోసపోవద్దు

గజ్వేల్‌రూరల్/నంగునూరు(సిద్దిపేట): అపరిచితుల మాటలు నమ్మి మోసపోవద్దని గజ్వేల్ షీటీమ్ ఏఎస్‌ఐ శ్రీరాములు సూచించారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం విద్యార్థినులకు ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, పోక్సో, షీటీమ్, యాంటీ హ్యూమెన్ ట్రాఫికింగ్, సైబర్ నేరాలు, నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏదైనా సమస్య తలెత్తినపుడు 100 లేదా షీటీమ్ (87126 67434)కు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో షీటీమ్ సిబ్బంది మహేశ్, అధ్యాపకులు పాల్గొన్నారు. అదేవిధంగా నంగునూరులో ఎస్‌ఐ ఆసిఫ్ మాట్లాడుతూ మైనర్లకు వాహనాలు ఇస్తే ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రవీందర్‌రెడ్డి, సిద్దిరాములు, నర్సింహులు పాల్గొన్నారు.



నంగునూరు(సిద్దిపేట): వాహనదారుడికి గులాబీ ఇస్తున్న విద్యార్థిని

వ్యక్తి అదృశ్యం

గజ్వేల్‌రూరల్: ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన మండల పరిధిలోని జాలిగామలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కాశమైన సాగర్‌కు భార్య లావణ్యతో పాటు ఇద్దరు కొడుకులున్నారు. ఆయన కూలీ పనులను చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో దంపతులిద్దరు తరచూ గొడవపడేవారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య గొడవ జరగడంతో 19న ఉదయం సాగర్ ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ రావడంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ నేడు విద్యుత్‌కు అంతరాయం

గజ్వేల్‌రూరల్: కొడకండ్ల సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా పలు గ్రామాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ అధికారులు పేర్కొన్నారు. కొడకండ్ల, రిమ్మనగూడ, దాతర్‌పల్లి, దాచారం, బూర్గుపల్లి, రాయవరం గ్రామాల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.

◆ బీజేపీ దిష్టిబొమ్మ దహనం

గజ్వేల్‌రూరల్: రాహుల్‌గాంధీపై అక్రమ కేసులు పెట్టడం సరికాదని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆంక్షారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద సోమవారం బీజేపీ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై అక్రమ కేసులు పెట్టడాన్ని ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్‌చైర్మన్ సర్దార్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

◆ విద్యార్థులకు ప్లేట్ల అందజేత

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అదే పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న రంగు రాజమల్లు గౌడ్ స్టీలు ప్లేట్లు అందజేశారు. తన తండ్రి రంగు నర్సయ్యగౌడ్ జ్ఞాపకార్థం విద్యార్థులకు ప్లేట్లు అందజేశారు. గ్రామస్తులు, ఉపాధ్యాయులు అతడిని అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కిషన్, ఉపాధ్యాయులు ఆయిల్‌రెడ్డి, ఆంజనేయులు, విజయ్‌కుమార్, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

◆ ఇష్టంతో చదివితేనే ఉన్నత స్థాయికి..

మద్దూరు(హుస్నాబాద్): విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదవుకొని ఉన్నత శిఖరాలను చేరుకోవాలని బెక్కల్ మాజీ ఎంపీటీసీ, రామలింగేశ్వరస్వామి ఆలయ మాజీ చైర్మన్ నలగొప్పుల రాములుగౌడ్ అన్నారు. గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలకు సోమవారం రూ.10వేల విలువ చేసే మైక్‌సెట్‌ను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చంద్రమౌళి, పంచాయతీ కార్యదర్శి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

◆ రంగనాయక సాగర్ నీటిపై రాజకీయమా?

చిన్నకోడూరు(సిద్దిపేట): రంగనాయకసాగర్ రిజర్వాయర్ నీటిపై బీఆర్‌ఎస్ నాయకులు తప్పుడు ప్రచారాలు చేయడం సరికాదని, సాగునీటిపై రాజకీయాలు చేయవద్దని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు మధు సూచించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే హరీశ్‌రావుకు రైతులపై గెజిట్ నోటిఫికేషన్ వచ్చిన తరువాత ఏ విధంగా భూమిని కొనుగోలు చేశారో చెప్పాలన్నారు. సమావేశంలో నాయకులు పల్లె రాజు, మహేశ్, భూంరెడ్డి, ఎల్లారెడ్డి తదితరులు ఉన్నారు.

◆ మందకృష్ణ జోలికొస్తే సహించేది లేదు

దుబ్బాకటౌన్/నంగునూరు(సిద్దిపేట)/చిన్నకోడూరు(సిద్దిపేట): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ జోలికొస్తే సహించేది లేదని సీనియర్ నాయకుడు ఇస్తారిగల్ల ఎల్లం హెచ్చరించారు. మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు రామూర్తిపై చర్యలు తీసుకోవాలని సోమవారం దుబ్బాక ఎస్‌ఐ గంగరాజుకు ఫిర్యాదు చేశారు. ఆయన వెంట నాయకులు రాజమల్లు, విజయ్, మహేశ్ తదితరులున్నారు. అదేవిధంగా నంగునూరులో నాయకులు కనకయ్య, రాజు, బాలరాజు తదితరులు రాజగోపాల్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అదేవిధంగా చిన్నకోడూరు పోలీస్‌స్టేషన్‌లో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, రంగరాజం, అరుణ్, రంజిత్, రమేష్, మురళి, ఆంజనేయులు, రాజు తదితరులు ఫిర్యాదు చేశారు.

◆ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా నాగేందర్

దుబ్బాకటౌన్: దుబ్బాక ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా చింత నాగేందర్ సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. హుస్నాబాద్‌లో జరిగిన జిల్లా ఆర్యవైశ్య మహాసభలో ఆయనతో పాటు ప్రధాన కార్యదర్శిగా రాజు, కోశాధికారిగా ధనుంజయం, బొమ్మెర నాగభూషణం, శ్రీనివాస్, శంకర్, రాజు, వెంకటేశం, రమేశ్ ప్రమాణ స్వీకారం చేశారు.

◆ రూ.10వేల ఆర్థిక సాయం

మిరుదొడ్డి(దుబ్బాక): ఇటీవల విద్యుదాఘాతంతో మృతి చెందిన గొల్లస్వామి కుటుంబాన్ని స్థానిక హనుమాన్ యూత్ సభ్యులు సోమవారం పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. పరామర్శించిన వారిలో యూత్ సభ్యులు తిరుపతి, లింగం, ఆకాశ్, చింటు, ఎండీ నజీర్ ఉన్నారు.

ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఎంపిక

గజ్వేల్‌రూరల్: ఎమ్మార్పీఎస్ నూతన కమిటీని సోమవారం ఎంపిక చేశారు. మండల ఉపాధ్యక్షుడు రవిమాదిగ అధ్యక్షతన ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకుడు మైస రాములుమాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కృష్ణ ఆధ్వర్యంలో నూతన కమిటీని నియమించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, అసెంబ్లీ కన్వీనర్ రమేశ్, మండల అధ్యక్షుడు నరేశ్, నాయకులు ఎల్లయ్య, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.